## ఈ కథ ఇంతే!

అమావాస్య చీకటి. హైవేరోడ్డు మీద దీపాల వెలుగు పలచగా పరుచుకుంది. సమయం పదకొండు దాటి ఉంటుందేమో.

పక్క ఊరికి స్కూటర్ మీద వెళ్తున్నాను. అత్యవసరపు పని. రేపు పెళ్లివారొస్తున్నారని బాబాయ్‌కి చెప్పాలి. అందుకే బయలుదేరాను.

ఆలోచనల్లో ఉన్నవాడిని ఏదో కారు రాసుకుంటూ ఇంచుమించు డాష్ ఇచ్చి వెళ్లడంతో ఆలోచనల్లోంచి బయటకొచ్చాను.

గుండె ఆగినంత పనయ్యింది. చావు రెప్పపాటుకాలంలో తప్పించుకున్నాను. అంత విశాలమైన రోడ్డుండగా నా స్కూటర్ మీద కొచ్చాడెందుకు?

పైగా నేను ఎడమవైపు వెళ్తున్నాను. వెంటనే అరిచాను. నోట్లోంచి అసంకల్పితంగా బూతుమాట వచ్చింది. కారులో వ్యక్తి తల బయటపెట్టి వెక్కిరించాడు. ముఖం లీలగా కనిపించింది.

మనస్సులోనే కారు నంబరును నోట్ చేసుకున్నాను కారు స్పీడుగా దూసుకుపోతోంది.

నా ప్రయాణం సాగుతోంది గుండె దడ తగ్గలేదు.

రోడ్డు పక్క మైలు రాళ్లు వెంటబడి తరిమే దెయ్యాల్లా ఉన్నాయి. మిణుకుమనే లైట్లు, కాంతి విహీనంగా ఉండి చీకటిని దూరం చెయ్యలేకపోతున్నాయి.

మత్తుగా ఉంది, నిద్ర ముంచుకొస్తోంది రోడ్డు పక్కన టీ బంకు, స్కూటరాపి టీ బంకు దగ్గరకొచ్చాను. నాకు డాష్ ఇచ్చిన కారు కూడా పార్క్ చేసి ఉంది.

కుర్రవాడు. లేత ముఖం, జులపాలుగా జుట్టు, టీషర్టు, జీన్స్, వయసు ఇరవైలోపు, తల బయట పెట్టి నన్ను వెక్కిరించిన ముఖం నాకెదురుగా, అయినా నన్ను మాత్రం గురించే స్థితిలో లేడు.

టీ తాగి బయలు దేరాను. నా ముందుగా కారు ఎందుకు వీడితో బాధ! అనుకుంటూ స్కూటర్ మెల్లగా పోనిస్తున్నాను. కారు మళ్లీ అదే స్పీడు... రోడ్డుమీద అస్తవ్యస్తంగా.

ఇంకో పావుగంటకు నేను చేరాల్సిన ఊరొస్తుంది. తెల్లవారేవరకూ అక్కడే గడిపిరావాలి అనుకున్నాను. వాతావరణం భయానకంగా ఉంది. చుట్టూ చీకటి ప్రతి రెండు మైళ్ళకు మాత్రమే లైట్లు దానికి తోడు చీమ చిటుక్కుమన్నా వినిపించే నిశ్శబ్దం మరీ భయాన్ని కలిగిస్తోంది.

ఇంతలో నిశ్శబ్దాన్ని చీలుస్తూ ఒక ఆర్తనాదం లీలగా... ఒక చావుకేకలా గుండెల్ని పిండేసినట్టు మై గాడ్! ఆ కారు ఎవరినో గుద్దేసి వెళ్లిపోయింది. సైకిలు మీద వెళ్తున్న వ్యక్తిని కాబోలు రెప్పపాటు కాలంలో కారు వెళ్లిపోయింది.

స్కూటరు స్పీడు పెంచాను. అర నిముషములో చేరుకున్నాను.

ఒక వ్యక్తి రోడ్డుమీద కొట్టుకుంటున్నాడు. తల చిట్లింది. రక్తం ధారాపాతంగా కారుతూ... ఒక పక్కన భోజనం కారేజి. ఏదో ఫాక్టరీలో పనిచేసే కార్మికుడు. కాకీ బట్టలు రక్తంతో తడిసిపోయాయి. రోడ్డుమీద చిందరవందరగా పడిన పువ్వులు,

భార్యకోసం కొన్నాడు కాబోలు. మరో పక్క బిస్కెట్ పాకెట్ పిల్లల కోసం కొన్నాడేమో... నిర్భాగ్యుడు అవి అందించకుండానే ఆగిపోయింది అతడి ప్రయాణం! అయ్యో! అనుకున్నాను ఆ దృశ్యం చూసి.

కొన ఊపిరితో ఉన్నాడు "పక్క ఊరు గంగవరం..." అంటూ రెండు చేతులూ జోడించాడు.

ఎలా ఇప్పుడు తీసుకెళ్లడం? అతణ్ణి తీసుకెళ్లాల్సింది వాళ్లింటికి కాదు. ఆస్పత్రికి

ఏదో లారీ వస్తోంది. చెయ్యెత్తాను. ఆపలేదు, నేను వెళ్లేదీ గంగవరమే అయిన అతణ్ణి ముందు ఆస్పత్రికే తీసుకెళ్లాలి. అంటే మళ్లీ వెనక్కి హైవే మీద ఏదో నర్సింగ్ హోమ్ ఉన్నట్టు గుర్తు.

దూరంగా ఏదో వాహనం వస్తున్నట్టుగా అనిపించింది 'భగవంతుడా! దీన్నైనా ఆపు తండ్రీ!' అని ప్రార్థించాను. అదొక పాల వాన్. డ్రైవర్ వారిది వాహనం ఆపాడు దిగకుండానే అరిచాడు "ఏం కావాలి?" అని

"ఏక్సిడెంట్ అయింది. వెనక్కి వెళ్లాలి నర్సింగ్ హోమ్‌కి. చూశారా రక్తం ఎలా కారుతోందో?"

డ్రైవర్ అన్నాడు బాబూ నా ఉద్యోగం పోతుంది. ఇది పాల వాన్ వాన్ నిండా రక్తం అయితే 'పాలు పాడవుతాయి. వద్దు బాబూ వేరే బండి చూడు" వెళ్ళిపోయాడు వాన్ డ్రైవర్.

నా గుండె వేగం పెరిగింది. మనసు మనసులో లేదు. చూస్తూ చూస్తూ ఒక నిండు ప్రాణం పోయేలా ఉంది. నిముషాలు భారంగా గడుస్తున్నాయి. మళ్లీ దూరంగా ఏదో లైటు వెలుగు.

ఏదో లారీ వస్తోంది. అడ్డంగా వెళ్లి నిలుచున్నాను. ఒక పక్క భయం... ఆ చీకట్లో నన్ను చూడకుండా గుద్దేస్తే... జేబురుమాలు ఊపుతూ నిలుచున్నాను

భయంభయంగా.

లారీ సడెన్ బ్రేక్‌తో ఆగింది.

"ఏం బాబూ, చావడానికి నా లారీయే దొరికిందా?" అరిచాడు డ్రైవర్.

"కాదు ఆ వ్యక్తి చూడండి రోడ్డుమీద పడిపోయి ఉన్నాడు ఆస్పత్రికి తీసుకెళ్లాలి!" చెప్పాను గబగబా.

డ్రైవరు, క్లీనరు దిగారు. నేను భుజాలు పట్టుకున్నాను. క్లీనరు సహాయంతో లారీలోకి ఎక్కించాం. లారీ బయలుదేరింది.

నేను స్కూటర్ స్టార్ట్ చేశాను. ఐదు నిముషాల్లో నర్సింగ్ హోమ్ ముందు ఆగింది లారీ స్కూటర్ ఆపి పరుగెత్తాను.

అర్ధరాత్రి పన్నెండు దాటింది ఆస్పత్రి నిశ్శబ్దంగా ఉంది. నర్సింగ్ హోమ్ లోపలకు వెళ్లగానే ఓ గదిలో కునికిపాట్లు పడుతూ ఒక నర్స్.

"అవతల పేషెంటు లారీలో ఉన్నాడు!" అన్నాను.

"అమ్మో ఎక్సిడెంటా? గవర్నమెంటు ఆస్పత్రికి తీసుకెళ్లండి! అంది.

"ఫరవాలేదమ్మా! ఏక్సిడెంటు కేసులు మీరు చూడవచ్చని పేపర్లో వేశారు. కనీసం ఫస్ట్ ఎయిడ్ చెయ్యండి."

అయిష్టంగా నర్సు లోపలకెళ్లింది, లారీలోంచి ఆ వ్యక్తిని దించాము, తలచుట్టూ గడ్డకట్టిన రక్తం, మెల్లగా సాగుతున్న ఉచ్వాశ నిశ్వాసలు.

తలకి బాండేజి కట్టింది. ఏదో ఇంజక్షన్ చేసింది.

నర్సుకు నమస్కారం చేసి గబగబా మళ్లీలారీ ఎక్కించాము. గవర్నమెంటు ఆస్పత్రికివెళ్లాలంటే సిటీలోకి వెళ్లాలి. అప్పటికే లారీ డ్రైవరు చేతులెత్తేశాడు. ఆటో

వెళ్తుంటే మాట్లాడాను, "మీటరకు రెట్టింపు తప్పదు మరి ఇతడు నా బంధువూ కాదు, స్నేహితుడూ కాదు. ఎవరో ఆగంతకుడు అయినా తప్పదు. ఆ వ్యక్తిని అలా హైవే రోడ్డుమీద వదిలేస్తే జీవితాంతం పదే పదే వెంటాడుతుంది ఈ ఘటన."

గవర్నమెంటు ఆస్పత్రికి వెళ్లే వరకూ నా ఆలోచనలు సాగుతూనే ఉన్నాయి.

పోలీస్ స్టేషన్‌లో రిపోర్టు చేశాను. ఎఫ్.ఐ.ఆర్‌లో ఆ వ్యక్తిని గుద్దేసిన కారు నంబరు నాకు గుర్తుండడంతో రాయించాను.

పోలీసు కానిస్టేబుల్‌ని తీసుకొచ్చి ఆ నిర్భాగ్యుణ్ణి అప్పగించాను. అతడికి ట్రీట్‌మెంటు మొదలవటంతో ఒక అరగంట తర్వాత గంగవరం బయలుదేరాను.

ఆ కార్మికుడు ఐడెంటిటీ కార్డులో అడ్రస్ ఉంది. గంగవరం చేరేసరికి తెల్లారిపోయింది. అతడి కుటుంబాన్ని కలిశాను, భార్య, ముసలి తల్లి, ఇద్దరు పిల్లలు, అంతా వచ్చేసరికి అతడి ప్రాణం అనంతవాయువుల్లో కలిసిపోయింది.

* * * * *

ఆరు నెలల తర్వాత.. నాకు మేజిస్ట్రేటు కోర్టుకు రమ్మని పిలుపు.

నాలో ఆవేశం కట్టలు తెంచుకుంది. తన నిర్లక్ష్యానికి ఒక కుటుంబాన్ని అనాథల్ని చేసిన వ్యక్తికి తగిన శిక్షపడాలి. నేను సాక్ష్యం చెపుతాను. కారును నేను చూశాను.కారు నంబరు నాకిప్పటికీ గుర్తే! ఆ రోజు కారు డ్రైవ్ చేసిన కుర్రాణ్ణి నేనెప్పటికీ మర్చిపోలేను. అలాంటివాడిని నా కసితీరా తిట్టాలి.

భవిష్యత్తులో అలాంటి ఘాతుకాలు వాడు చేయకుండా బల్లగుద్ది సాక్ష్యం చెపుతాను. దానికోసం నా టైము వృథా అయినా ఫరవాలేదు...! ఇలా ఆలోచించుకుంటూ బయలుదేరాను

కోర్టు ఆవరణలో ఆ కారు.. నాకు ఆనందం కలిగింది. దోషి

తప్పించుకోనందుకు ఉద్వేగంగా కోర్టు రూమ్‌లోకి అడుగుపెట్టాను. నేను రిపోర్టు చేసిన స్టేషన్‌లోని పోలీసు లాయరుతో మాట్లాడుతూ కనిపించాడు.

ఆ పోలీసు పక్కనే ఒక పెద్దాయన. సఫారీ డ్రెస్, గోల్డ్‌ఫ్రేమ్ కళ్లద్దాలు, చేతులకు ఉంగరాలు... చాలా ఖరీదైన మనిషిలా ఉన్నాడు. ఆయనే కారు యజమాని. కారు డ్రైవ్ చేసిన కుర్రాడి తండ్రట. వారి మాటలు బట్టి తెలిసింది.

నేను పోలీసు దగ్గరకెళ్లి నిలుచున్నాను.

"ఆ కారు డ్రైవ్ చేసిన కుర్రాడేడీ?" అన్నాను పోలీసుతో.

పోలీసు నా వంక ప్రశ్నార్థకంగా చూసి, "అదిగో, అతడే, అన్నాడు మాకు కొంచెం దూరంలో నిలబడిన వ్యక్తిని చూపిస్తూ.

నాకు మతిపోయింది. కళ్లు నులుముకుని చూశాను. మాసిన బట్టలు కొద్దిగా పెరిగిన గడ్డం... లోతుకు పోయిన కళ్లు.. అతడు కాదు, అతడు కాదు! "ఆ రోజు కారు డ్రైవ్ చేసింది అతడు కాదు...!" దాదాపు గట్టిగా అరిచాను.

నా మాటలకు పోలీసులొచ్చి నన్ను పక్కకు లాక్కెళ్లారు." మీ మాటలు ఇక్కడ చెల్లవ్! ఆ వ్యక్తి తనే డ్రైవ్ చేశానంటున్నాడు ఆ కారు యజమాని స్వయంగా తెలియచేశాడు అతడు తన కారు డ్రైవర్ అని, మీరెక్కువగా మాట్లాడితే మీ మీదే మేము కేసుపెట్టే ప్రమాదం ఉంది ఇవన్నీ మాకు మామూలే."

పోలీసు మాటలతో నేను వెనక్కు తగ్గాను. నా నోరు నొక్కేసుకున్నాను నా గొంతు కండరాలు కదలికలు ఆగిపోయాయి.

వారి అబద్ధ సాక్ష్యంతో ఏకీభవించాను. వారు పెట్ట మన్న చోట సంతకం పెట్టాను గంటలో పని పూర్తయింది. కోర్టు గదిలోంచి బయటకు నడిచాను.

న్యాయానికి చెవులే గానీ, కళ్లు లేవు! అవును డబ్బుతో న్యాయం కొనవచ్చును.

ఓ నిరపరాధి డబ్బుకోసం అపరాధి అయ్యాడు. లైసెన్సు లేకుండా ఏక్సిడెంట్ చేసి ఒక కుటుంబాన్ని వీధిన పడేసిన దోషి తప్పించుకున్నాడు.. ఇలా ఆలోచిస్తూ స్కూటర్ స్టార్ట్ చేశాను ఇంటికి వెళ్లడానికి.

ఇంతలో నా మిత్రుడు ఎదురుగా వచ్చాడు. "ఏమిటీ కోర్టుకొచ్చావు?" అన్నాడు చెప్పాను జరిగిన విషయం. "ఏదో సినిమాలో ఇలాంటి సంఘటనే జరిగింది. కానీ హీరో విలన్లతో ఏకీభవించలేదు. న్యాయం కోసం పోరాడాడు. నీలా భయపడి పారిపోలేదు!" అన్నాడు.

నేను నీరసంగా నవ్వాను. నేను సామాన్యుణ్ణి. సినిమా హీరోని కాదు. 'ఈ కథలింతే!' నిట్టూర్పు విడిచాను. అంతకన్నా చేయగలిగేదేముంది?

- ఆంధ్రప్రభ సచిత్రవార పత్రిక

* * * * *